# మమతల పందిరి

## – సత్యవాడ సోదరీమణులు

''మీ అమ్మానాన్నల్ని రావద్దని ఫోన్ చేసేద్దాం'' ఆఫీసు నుంచి రాగానే భర్తకి కాఫీ అందిస్తూ అంది రాగిణి.

మౌనంగా కాఫీ తాగుతూ ఆలోచిస్తున్నాడు రాజీవ్.

అతని తల్లిదండ్రులు రెండేళ్ళ తరువాత కొడుకు, కోడల్ని, మనవల్ని చూడడానికి వస్తున్నారు. ప్రేమాభిమానాల్ని మూటగట్టుకుని ప్రయాణం అవుతున్న వాళ్ళని రావద్దనడం ఎలా? రాజీవ్‌కి ఎటూ తోచడంలేదు.

''ఏమండీ సరేనా?'' రెట్టించింది రాగిణి.

రాగిణి అత్తమామల పొడ గిట్టని కోడలేంకాదు. నిజానికి తన కన్నతల్లి కంటే అత్తగారినే అనురాగంతో ఆదరించే సంస్కారవంతురాలు. పసితనంలోనే తండ్రిని పోగొట్టుకుని నాన్న ప్రేమ పొందని రాగిణి మామగారిలోనే తండ్రిని చూసుకుంటుంది. ఈ రెండేళ్లల్లో వాళ్ళు తమ ఇంటికి రాకపోవడం ఆమెకెంతో బాధ కలిగించింది. తీరా వస్తామనేసరికి ఈ పరిస్థితి. ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ అలాగే వుండిపోయారు.

రెండు నిముషాల తరువాత రాజీవ్ అన్నాడు ''నాకు మనస్కరించడంలేదు రాగిణి. వేరేదైనా ఉపాయం తడిచే బావున్ను.''

భర్త ఆ మాట అనడం సబబే. అసలు రెండేళ్ళక్రితంవరకూ అత్తమామలు తనతో కలసే వున్నారు. మరిది చంద్రం ప్రమోషన్ మీద గోవా వెళ్లిపోవడం, వెంటనే తోడికోడలు శ్వేత నెల తప్పడంతో చంద్రం అమ్మానాన్నలు పెద్ద దిక్కుగా మా దగ్గరేవుండాలని తీసుకెళ్లాడు.

''శ్వేతకి పురుడుపోసి వెంటనే వచ్చేస్తానే. నిన్నూ, పిల్లల్ని చూడనిదే తోచకు నాకు'' అంటూనే బయలుదేరారు అత్తగారు. ఆవిడకి తనని వదిలి వెళ్లడం ఎంత కష్టంగా కనిపించిందో తనకీ అంతే. ఉద్యోగ బాధ్యత, సంసారం బాధ్యత నిర్వర్తించడంలో ఉండే సాధక బాధకాలు అత్తగారు వెళ్లిపోయేదాకా తను ఎదుర్కోవాల్సి రాలేదు. తనకి షిఫ్ట్ డ్యూటీలయితే పిల్లల్ని ఆవిడే చూసుకునేవారు. ఇంటి పనులు సరేసరి.

''నువ్వేం చేస్తావమ్మా. బొత్తిగా చిన్నపిల్లవి. ఉద్యోగం చేసి అలిసిసొలిసి వస్తావ్'' అంటూ గారాబంగా చూసేవారు. అలాంటిది ఒక్కసారిగా ఆవిడ వెళ్లిపోతే ఇంటి మాట ఎలా వున్నా మనసు వెలితిగా ఐపోయింది. ఆ వెలితి తీర్చడానికా అన్నట్లు అప్పటిదాకా ఖాళీగావున్న పక్కవాటాలోకి రాకేష్ కుటుంబం అద్దెకు దిగారు. రాణితో తన పరిచయం ఎంతగా అల్లుకుపోయిందంటే అన్ని బంధాలను మించి హృదయాలను పెనవేసింది.

నానమ్మ, తాతయ్య ఊరెళ్లిపోవడంతో రవి, రాధికలైతే చైతన్యం కోల్పోయారనే చెప్పాలి. లాలించి, బుజ్జగించి, వాళ్లచేత ప్రతి పనీ చేయించేది నానమ్మ. స్కూలునుంచి తీసుకొచ్చి షికారు తీసుకెళ్లి కథలు చెప్పి ఆడించి ఆ తరువాత చదువులో నిమగ్నం చేయడంలో వాళ్లకి చదువు కష్టమనిపించేదికాదు. ప్రతి క్లాసులోనూ ఫస్ట్‌ర్యాంకు తెచ్చుకుంటూ ఉత్సాహంగా ఉంచే తాతయ్య వెళ్లిపోతే ఆ పసి మనసుల్లో స్తబ్దత అలుముకుంది. వాళ్ళు వయసువాళ్ళే అయినా రాణీ కూతుళ్ళు మేరీ, రోజా ఆ స్తబ్దతని ఇట్టే మాయం చేశారు. ఆటపాటల్లోనూ, చదువుసంధ్యల్లోనూ నలుగురూ ఒకటి. ఒకరి పద్ధతులు మరొకరికి చిటికెలో అలవడ్డాయి. శుక్రవారం అమ్మవారి గుడికైనా, ఆదివారం చర్చికైనా ఆ రెండు కుటుంబాలు కలిసే వెళతాయి. ముద్దుముద్దుగా రోజా భగవద్గీత చదవడం నేర్చుకుంది రవి దగ్గర. రాధిక, రవి బైబిల్ కథలు చెప్పుకుంటూనే నిద్రలోకి జారుకుంటారు. పిల్లల మంచం మీదనుంచి బైబిల్ పుస్తకం తీసి చిరునవ్వుతో రాజీవ్, రాగిణి చేతికందిస్తూ అన్నాడు.

''మన పిల్లలు దీన్ని ఔపోసనం పట్టేశారు.''

''ఔను మరి. వాళ్ళ రోజా రాగయుక్తంగా భగవద్గీత చదివి గీతాసమాజంలో ఫస్ట్‌ప్రైజ్ తెచ్చుకోలేదూ'' పుస్తకాన్ని భద్రంగా అల్మారలో పెడుతూ అంది.

ఆ ఇళ్ళల్లో, బైబిల్, భగవద్గీత కలసి కాపురం చేస్తున్నాయి. నిజానికి ఆ రెండు కుటుంబాలు ఏకమైపోయాయి. ఒకరికొకరు అన్నింటా చేదోడువాదోడై కాలాన్ని కరిగిస్తారు. రాణీ ఓ ప్రైవేట్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పని చేస్తోంది. ఆమెకు రాగిణి కంటే కాస్త ఎక్కువ తీరిక చిక్కడంతో ఆదరాబాదరా రాగిణి ఆఫీసుకు పరుగెత్తవలసి వచ్చినప్పుడల్లా రాణి, రవి, రాధికల బాధ్యత పూర్తిగా తీసుకుంటుంది. తన స్నేహితురాలు తెల్లవారుఝామున ఆఫీసుకి వెళ్ళవలసివస్తే స్నానం చేయించడం మొదలు కొసరి కొసరి అన్నం తినిపించి తన పిల్లలతోపాటు వాళ్ళను కూడా తయారుచేసి నలుగురికీ లంచ్‌బాక్సులు కట్టి స్కూల్లో దిగబెట్టడంవరకూ అన్నీ తనే. ఇక నేస్తానికి నైట్ డ్యూటీ పడిందా సరేసరి.

నలుగురి అల్లరి పూర్తిగా తనే భరిస్తుంది.

''నాకిదేం పనిష్మెంట్ డియర్. మనం ఇద్దరే చాలనుకుంటే నువ్వు నలుగురికి తల్లివైపోయావు. నేను ఏ సాయంత్రం ఏ ప్రోగ్రాం ప్లాన్ చేసుకుందాం అనుకున్నా నువ్వు ఈ అవతారంలోనే వుంటావ్. నీ సైన్యంతో సతమతమవుతూ తెగ ఆనందపడిపోతావు తప్ప ఈ దీనుడ్ని కరుణించవేం? అర్ధరాత్రిళ్ళు కూడా నాకు బెడ్‌రూమ్‌లో ఒంటరితనమే'' రాకేష్ గోముగా ఎన్నోసార్లు తన మనోభావాల్ని వ్యక్తపరుస్తాడు.

రాణి కొంటెగా నవ్వి ''బాగుంది. ఇరుగుపొరుగు అన్నాక ఒకరికొకరు ఈ మాత్రం సహాయం చేసుకోకపోతే ఎలా?'' అని సమాధానపరుస్తుంది.

• • •

ఆ దంపతుల ఆలోచనలు చెదరగొట్టేస్తూ బిలబిలమంటూ నలుగురు చిన్నారులూ, వాళ్ళ వెనుకే రాణి లోనికొచ్చారు.

''అరే! మీరిద్దరూ చాలా సీరియస్ మూడ్‌లో వున్నారు'' అయోమయంగా చూపులు చూస్తూ కూర్చుండిపోయిన రాగిణి చెయ్యందుకుంటూ అడిగింది రాణి.

అదే స్థితిలో వున్న రాజీవ్ ''అదే...మా అమ్మా నాన్నా పైవారంలో వస్తామని రాశారు. ఆ విషయంలోనే చిన్న సమస్య వచ్చి పడింది చెల్లెమ్మా.''

రాగిణి భర్తని ఉరిమి చూసింది. ఆ చూపులతో అతని మాటలకి బ్రేక్ పడింది. నిజమే తమ మనస్సుల్లోని అలజడేమిటో రాణి ఏ మాత్రం పసిగట్టినా ఎంతో నొచ్చుకుంటుంది, అనుకున్న అతను ''వీళ్ళందర్నీ ఇంత ముచ్చటగా ముస్తాబు చెయ్యటానికి ఎంతసేపు కుస్తీ పట్టావేమిటి?'' అంటూ మాట మార్చాడు.

చేమంతులతో అల్లిన జడలు, గోరింట పెట్టిన సన్నని వేళ్ళు, ఆడపిల్లలు ముద్దుగా కనిపిస్తున్నారు.

రాణి నవ్వుతూ ''ఇలాంటి ముచ్చటైన అలంకరణ

అంటే నాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం అన్నయ్యా. నా సరదా తీర్చుకోమన్నట్టు యిద్దరూ ఆడ పిల్లలే.''

''అయితే మాత్రం యివన్నీ ఎంతో కళాత్మకమ్మైనవి... చేతకావద్దు! నా అదృష్టం పండి ఇదిగో ఇక్కడి కొచ్చాం. రాగిణి శిష్యరికంలో అన్నీ నేర్చేసుకున్నా'' రాగిణివైపు కృతజ్ఞతగా చూస్తూ బదులిచ్చింది.

''అవునండీ రాణీ చెబుతూ ఉంటుంది. చిన్నతనంలో తనకీ పూలజడ వెయ్యమని, బొట్టు కాటుక పెట్టి ముస్తాబు చేస్తేకాని స్కూల్‌కి వెళ్ళనని ఏడ్చేదట. మతాన్ని మంట కలిపే నీ కోరికలు పాడుకాను. అందుకే నేను హిందువుల పిల్లలతో స్నేహమే చెయ్యొద్దంటాను. వాళ్ళతో నీకేమిటి? అంటూ కస్సుమనేదట వాళ్ళమ్మ. అయినా పట్టు వదలక మీ చెల్లాయి దెబ్బలు తినేదట.''

''అయితే ఇంత కథ ఉందన్నమాట'' అంటూ నవ్వేశాడు.

''అది గతం అన్నయ్యా. ఇప్పుడిక మా శ్రీవారు దేనికీ అభ్యంతరం చెప్పరు.''


''చూస్తూనే ఉన్నాకదమ్మా. రాకేష్ చాలా సంస్కారవంతుడు.''

''మీరు మాత్రం నిజానికి మహోన్నతులు. ఎంత సంప్రదాయమ్మైన కుటుంబం మీదైనా మా పిల్లల్ని చేరదీసి మురిపెంగా చూస్తారు.''

''ఊరుకో రాణి, మతాలదేముంది! మనసులు కలిస్తే అంతా ఒక్కటే. నిజానికి మన భారతీయతలో అంతర్లీనమ్మైయున్నది వసుధైక కుటుంబ ఆకాంక్షే కదా! మతపరమ్మైన ఇన్ని మారణహోమాలు, హత్యాకాండలు జరుగుతుంటే మన శాంతి వీణ అపశృతులనే పలుకుతున్నట్లు అనిపిస్తోంది. ఈ మధ్య క్రైస్తవులపై జరిగిన దారుణాలు తలుచుకుంటుంటే మా మనస్సులే సిగ్గుతో కుంచించుకు పోతున్నాయ్. చర్చ ముంగిటే భగవంతుని గురించి నాలుగు మంచి మాటలు చెప్పాలని విదేశాల నుంచి వచ్చిన వాళ్ళు ఘోర హత్యలకు గురికావటమా!'' ఆవేదనగా అంది రాగిణి.

''బాధపడకు రాగిణి. కొందరైనా మీలా ఆలోచిస్తే దేశంలో ఇప్పటికైనా మార్పు రాకపోతుందా? మనుష్యులపైన నాకు అపారమ్మైన నమ్మకం ఉంది. మన పిల్లల్ని ఈ తేడాలేవీ సోకకుండా పెంచుదాం. రేపటి తరం ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోకూడదు అని ఆశిద్దాం'' స్నేహితురాళ్ళిద్దరూ చాలాసేపు కబుర్లలో పడిపోయారు.

''అరె అసలు విషయం చెప్పటం మర్చిపోయాను. ఈ క్రిస్టమస్‌కి వీళ్ళందరికీ కొత్తడ్రస్‌లు కొనడం కోసం షాపింగ్‌కి బయలుదేరుదామా అని అడగటానికి వచ్చినదాన్ని. ఏమిటో గుర్తు



లేదు.''

''భలేదానివే రాణి... ఆరు దాటిపోయింది కదా! అయినా వెళ్ళొచ్చేద్దాం'' అంటూ తనూ తయారయ్యింది రాగిణి.

• • •

అనుకున్నకంటే రెండు రోజులు ముందుగానే రాజీవ్ తల్లిదండ్రులు వచ్చేశారు. వాళ్ళను చూస్తూనే రాజీవ్, రాగిణి ఒక్క క్షణం బిత్తర పోయారు.

''ఏమర్రా! అలా చూస్తున్నారు? అనుకున్నకన్నా ముందుగా వచ్చేశామనా?'' ఆటో డ్రైవర్‌కి డబ్బులిస్తూ అన్నాడు రాఘవరావు.

''అబ్బే అదేం లేదు నాన్న'' తడబడ్డాడు.


''అదేం మాట మావయ్యా. ఈ రెండేళ్ళు రెండు యుగాలుగా గడిచాయి మాకు. మీరు ముందు లోపలికి పదండి. బాగా పొద్దెక్కింది. మావయ్యగారు ఆకలికి ఆగలేరు. వేన్నీళ్ళు రెడీగా వున్నాయి. స్నానాలు కానిస్తే ఫలహారాలు చేసేద్దాం. మీ అబ్బాయ్ సామాన్లన్నీ లోపలికి తీసుకొస్తార్లేండి'' తమ మనోభావాలు వ్యక్తం కాకూడదని జాగ్రత్తపడుతూ అత్త మామలని తొందరచేసింది రాగిణి.

• • •

''రాగిణీ! పిల్లలేరి?'' ఆఫీసునుంచి వస్తూనే అడిగాడు రాజీవ్.

భర్త ముఖంలో అలసట, ఆందోళన కనిపెట్టిన రాగిణి ''ముందు టీ తాగండి! జరగరానిదేమీ జరగదులెండి.''

''అదికాదు రాగిణి. ఇంతకీ పిల్లలకి చెప్పావా లేదా? ఈసారికి మన ఇంట్లో క్రిస్‌మస్ గిస్‌మస్ నో అని, అసలు ఎక్కువగా మేరీ, రోజాలతో ఆడవద్దని'' టీ కప్పు చేతుల్లోనే ఉంచుకుని ప్రశ్నిస్తున్న భర్త ముఖంలో కంగారు చూసి మరింతగా కలవరపడిపోయింది. కానీ తానెలా చెప్పగలదు. చెబితే మాత్రం ఆ గడుగ్గాయిలు మాట వింటారా! అతనికంటే నిజా



## మొట్టమొదటి 'జూ'

1150 బి.సి.లో మొట్టమొదటి 'జూ'ని (జంతు ప్రదర్శనశాల) చైనా చక్రవర్తి స్థాపించాడు. ఇక్కడ దుప్పులు, లేళ్ళు, పక్షులు, చేపలు లాంటి రకరకాల జంతువులు ప్రదర్శింపబడేవి. చక్రవర్తి మరియు ఇతర గొప్ప గొప్ప జమీందారుల విలాసానికి ఇది ప్రారంభింపబడింది. ప్రజల కోసం మొట్టమొదటి 'జూ' 1793లో పారిస్ (ఫ్రాన్స్)లో ఏర్పాటు చేసారు. దీంట్లో జంతువులు ప్రదర్శింపబడేవి. ఇందులో ఒక మ్యూజియం, బోటానికల్ గార్డెన్స్ కూడా ఏర్పాటు చేసారు. తరువాత జూ 1829లో లండన్ (ఇంగ్లండ్)లో ప్రారంభమైంది. ఆ తరువాత బెర్లిన్ (జర్మనీ)లో ప్రారంభించారు. ప్రపంచంలోనే ఇది బ్రహ్మాండమైన 'జూ'గా పేరు పొందింది.

## పైలట్ లైసెన్స్ పొందిన తొలి భారతీయుడు

జె.ఆర్.డి. టాటా భారతదేశంలో 1929వ సంవత్సరంలో పైలట్ లైసెన్స్ పొందిన మొట్టమొదటి భారతీయుడు. భారతదేశం నుంచి లండన్ నగరానికి ఒకే ఇంజనుగల విమానంలో ఒంటరిగా ఎగిరిన తొలి భారతీయ పౌరుడు కూడా ఇతడే.

## కటిక దరిద్రం

యునైటెడ్ నేషన్స్ ఆహార మరియు వ్యవసాయక సంస్థ (ఎఫ్ఎఓ) వారి వివరణ ప్రకారం మొత్తం అరవై ఎనిమిది అభివృద్ధి పొందుతున్న వర్ధమాన దేశాల్లో నివసించే 1,340 మిలియను మంది జనాభాలో సగానికి సగం పైగా అంటే సుమారు ఏడు వందల మిలియను మంది కటిక దరిద్రాన్ని అనుభవిస్తున్నారు.

- జి.శారద

నికి తనకే భయంగా ఉంది. అత్తయ్యగారిది 'నిప్పులు కడిగే మడి. అంతులేని ఆచారం' ఇవన్నీ పసిగట్టారంటే ఏమాత్రం సహించరు సరికదా, వెంటనే తిరుగు ప్రయాణం కట్టినా కట్టేస్తారు.

మధ్యాహ్నామే, 'నేను లేనన్నాళ్ళు ఇంటా బయటా ఎలా నెట్టుకొచ్చావే తల్లి. ఈ మొండి ఘటాలు నిన్ను వేపుకు తినేశారా?' అని అత్తయ్యగారు అడుగుతుంటే అది ఆప్యాయతా? ఆరా తీయటమా? అని తికమకపడింది తను! 'పక్క వాటాలో వాళ్ళు కాస్త కలుపుగోలు మనుషుల్లానే కనిపిస్తున్నారు. మనవాళ్ళకి తోడుగా ఉండి వుంటార్లే మావగారి జోడింపు.'

''అలా ఏం లేదు మావయ్యా! రవి, రాధికా పెద్దవాళ్ళవుతున్నారుగా, వాళ్ళ పనులు వాళ్ళే చేసుకోవటం అలవాటు చేస్తున్నా. పెద్దవాళ్ళు మీరు దగ్గర లేకపోతే మా అవస్థలేవో మేము పడక తప్పేదేముంది'' సర్ది చెప్పింది.

''మాట్లాడవే రాగిణి. నువ్వేమీ జరగదంటూ నీళ్ళు నములుతూ కూర్చుంటే కాదు. వాళ్ళకి గట్టిగా చెప్పాలి. తిట్టో కొట్టో, భయపెట్టో, నోరెత్తకుండా చేయకపోతే లాభం లేదు. అమ్మా, నాన్నల ముందు అన్నీ వాగుతారు. అప్పుడిక మన పని చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు అవుతుంది.''

''అబ్బా! అంత పైకెందుకెళ్ళిపోతారు?''

''పిల్లలకెలాగయినా నేను నచ్చ చెబుతాను. చల్లారిపోతోంది ఆ టీ తాగండి ముందు.''

''ఏమో ఏం నచ్చచెబుతావో? నా తల తిరిగిపోతోంది బాబు. అటు పెద్దవాళ్ళ చాదస్తం, ఇటు ఈ పసివాళ్ళ ఉత్సాహం... రెండింటి మధ్య మన మనసులు నలిగిపోతున్నాయి.''

ఒక్క గుక్కలో టీ తాగేసి విసురుగా కప్పు టీపాయ్ మీద పడేసి బయటికి వెళ్ళిపోయాడు.

అత్తమామల చెవిన పడకుండా పిల్లలకి విషయాన్ని వివరించి చెప్పాలని శతవిధాల ప్రయత్నించింది రాగిణి. వాళ్ళు నానమ్మ, తాతయ్యలని వదిల్తేగా. హోంవర్క్ చేయించే నెపంతో పిలిచి చెబుదామనుకుంది.

''తాతయ్యే ఇవాళ్టినుంచి హోంవర్క్ చేయిస్తారు. తాతయ్య దగ్గరే కూర్చొని చదువుకుంటాం. ఏది అర్ధమవ్వక పోయినా ఎంచక్కా చెబుతారు'' అన్నాడు రవి. ఎనిమిది దాటాక అన్నాలు పెట్టే మిషతో దగ్గర కూర్చోపెట్టుకుని లాలనగా వాళ్ళకి బ్రెయిన్ వాష్ చెయ్యాలనుకుంది. కుదరనిస్తేగా.

''ఎన్నాళ్ళయిపోయిందో నానమ్మ అన్నం తినిపించి? నాకు నువ్వేం అక్కర్లేదు. బోల్డన్ని కథలు, కబుర్లు చెబుతూ నాన్నమే అన్నం తిపిపిస్తుంది'' అంది గోముగా రాధిక.

ఇక వీళ్ళని రహస్యంగా పట్టుకోవడం తనవల్ల కాదు. ముందే చెప్పుండవల్సింది విసుగ్గా అనుకుంది. ఆ రాత్రి నానమ్మ, తాతయ్యల దగ్గరే నిద్రపోయారు వాళ్ళు. వంటిల్లు సర్దుకుని పనులన్నీ చక్కపెట్టుకుని తన బెడ్‌రూమ్‌లోకి ఉసూరుమంటూ వెళ్ళింది రాగిణి. భర్త మగత నిద్రలో వున్నాడు. ప్రేమగా అతన్ని చూస్తూ నిట్టూర్చింది. లేనిపోని గొడవొచ్చి పడింది. ఈ బెంగతో ఈయన భోజనం కూడా సరిగ్గా చేయలేదు. ఏ మాత్రం అలికిడైనా భర్త నిద్ర చెదిరిపోతుందేమో అన్నట్టు నెమ్మదిగా లైటు తీసేసి తనూ మంచాన్ని ఆశ్రయించింది. రాజీవ్‌కి మెలకువ రానే వచ్చింది. దిగ్గున లేచి కూర్చుని ''ఏం రాగిణీ! పిల్లల్ని దారికి తెచ్చావా?'' మళ్ళీ ప్రశ్నించాడు.

''ఎక్కడండీ...శతవిధాల ప్రయత్నించినా వాళ్ళు పట్టుచిక్కటం లేదు. ఒక్క క్షణమైనా అత్తయ్యా మావయ్యలని వదిలి ఉంటున్నారా?''

''మరెలా రాగిణి? అమ్మా నాన్నలవి మరీ ఛాందస భావాలు. రాకేష్ కుటుంబంతో మన అనుబంధం చూశారంటే ఇంకేమైనా ఉందా?'' తల పట్టుకున్నాడు. ఇక రాగిణి భర్తకి ధైర్యం చెప్పలేకపోయింది.

''ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో నాకూ అంతుపట్టడం లేదండి'' అనేసింది బేలగా.

ఆ రాత్రి ఇద్దరికీ నిద్ర కరువయ్యింది.

రాణీ వాళ్ళతో స్నేహానుబంధం పెంచుకుంటున్నప్పుడు, పిల్లలు ఒకటిగా అల్లుకుపోతున్నప్పుడూ ఇంత దూరం ఆలోచించలేదు.


మానవత్వాన్ని మించిన మతం ఏముందని అనుకున్నారే తప్ప తమ ఇంటి పెద్దల ముందు తలవంచవలసి వస్తుందని అప్పుడు తలపుకి రాలేదు.

• • •

తెల్లవారడంతోనే ఇంట్లో హడావిడి మొదలయ్యింది. వైదేహి మడికట్టుకొని వంటకి ఉపక్రమించింది. నాన్నమ్మ పక్కనే కూర్చుని ఆమెకు కావలసినవన్నీ అందిస్తోంది రాధిక.

''చూసావా నాన్నమ్మా నేను అసలు నిన్ను ముట్టుకోకుండా నీకు సాయం చేస్తున్నాను. నాకూ మడి చీర కట్టుకోవడం నేర్పవు'' గారాలుపోతున్న మనవరాలిని కళ్ళతోనే ముద్దాడుతూ ''నా బంగారు తల్లి. నీకన్నీ నేర్పుతానమ్మా!'' అంటోంది వైదేహి. తాతయ్యతో తనూ వాకింగ్‌కి వెళ్ళి వచ్చిన రవి ''అబ్బ! ఎన్నాళ్ళయ్యిందో తాతయ్యా! మనం ఇలా సరదాగా వాకింగ్‌కి వెళ్ళి. నువ్వూ నాన్నమ్మ వచ్చేస్తే ఎంత బాగుందో'' అన్నాడు.

తనను కన్నవాళ్ళు, తను కన్నవాళ్ళతో ఇలా ప్రేమగా మెలగటం చూస్తుంటే రాజీవ్‌కి ఆనందంగానే వుంది. కాని ఏమూలో ములుకులా ఈ భయం తొంగిచూ



స్తుంది. వాళ్ళ కబుర్ల మధ్య దొర్లిన ఓ మాటకి రాజీవ్ అదిరిపడ్డాడు. భార్య దగ్గరకు పరిగెట్టాడు. ఇక తుపాను రేగిపోయింది అన్నాడు. ఇల్లు ఊడుస్తున్న రాగిణి చీపురు పక్కన పడేసి ''ఏమయ్యిందండీ?'' అంది ఆత్రంగా!

''మనం మరిచేపోయాం. ఈవాళ్టినుంచే పిల్లలకి సెలవులు. నిన్నంటే ఎలాగో గడిచింది. కాని, సెలవ లేగా ఇక వీళ్ళను పట్టలేం. నలుగురూ కలిసి ఇల్లు తీసి పందిరేస్తారు. మనం వీల్లేదని చెప్పేలోగానే వీళ్ళంతా కలిసి మనింట్లోనూ క్రిస్మస్ సందడి మొదలు పెట్టేస్తారు. ఇక అమ్మానాన్నల దగ్గర మన మేమీ దాచలేం! వాళ్ళు ఉగ్రరూపం దాల్చడం ఖాయం. తట్టుకోలేని అల్పజీవులం అయిపోతాం మనం.'' రాగిణి ముఖం వాలిపోయింది.

''ఛ... మనం పొరపాటు చేశామండి. అత్తయ్యా, మావయ్యా వస్తామని రాసినప్పుడే వీళ్ళ నోటికి తాళం, కాళ్ళకు కళ్ళెం వేసి వుండాల్సింది'' అంది.

''పోనీ ఓ పని చేయకూడదు?''

భర్తవైపు ఏమిటీ అన్నట్టు చూసింది.

''ఇవ్వాళ్టికి నువ్వెలాగయినా ఆఫీసుకి సెలవు పెట్టేయ్. పిల్లల్ని కనిపెట్టుకొని వుండు. అమ్మా నాన్నల్ని ఏ కోవెలకో పంపించి పిల్లల్ని మందలించు. ఏమంటావ్?''

''అమ్మో! నాకస్సలు కుదరదండీ. రాగానే వంటిల్లు అప్పగించడం బాగుండదని నిన్న సెలవు పెట్టేసా. ఆ పనేదో మీరే చేయండి.''

''చంపేశావ్ పో! మా ఆఫీసులో ఇన్స్‌పెక్షన్ ఉంది. నాకంతకన్నా కుదిరి చావదు.'' దడదడలాడుతున్న గుండెలతో ఇద్దరూ ఉద్యోగ ధర్మం నిర్వర్తించారు.

● ● ●

ఒకరిని మించి మరొకరు ఆత్రుత పడుతూ ఒకేసారి ఇల్లు చేరారు. మూసి వున్న తలుపులు, బిగించి వున్న తాళం కప్ప ఆ జంటని మరింత కలవరపరచింది.

''వీళ్ళంతా ఏమైనట్టు?''

''ఏమో రాగిణీ. అమ్మానాన్న విషయమంతా తెలిసి పోయి మనమీద కోపగించుకుని వెళ్ళిపోయుంటారు. మన వెధవలకి పనేముంది? ఆ పిల్లల దగ్గరకు పోయుంటారు'' భార్య మాట పూర్తికాకుండానే అనేశాడు.

మౌనంగా రాణి యింటికి పరిగెత్తింది రాగిణి. భార్యనే అనుసరించాడు రాజీవ్. ఆ దంపతుల కంట పడిన దృశ్యం వాళ్ళని చకితుల్ని చేసింది. రెప్పార్పకుండా చూస్తుండిపోయారు. రాఘవరావు పిల్లలందరినీ పక్కన కూర్చోబెట్టుకుని క్రిస్మస్ చెట్టుని తనే అలంకరిస్తున్నాడు. వైదేహి, రాణికి కేక్ తయారు చేయడంలో సహాయపడుతోంది.

''అలా నిలబడిపోయారేం? లోపలికి రండి'' రాజీవ్ చేయందుకున్నాడు రాకేష్.

''ఏరా నన్ను, మీ అమ్మనీ ఇలా చూస్తూ నమ్మలేక పోతున్నావా? ఏ అలజడి రేగుతుందోనని హడలిపోయారా మీ ఇద్దరూ?''

''అది కాదు నాన్నా! మరి మీరు ఏమనుకుంటారో...'' అని రాజీవ్ అనబోతూంటే-

''మతాలకు అతీతంగా పెనవేసుకుపోయిన మీ స్నేహాన్ని మరుగుపరచటం కోసం మదనపడిపోయారు'' రాఘవరావు బిగ్గరగా నవ్వి అన్నాడు.

''నాన్నా! అయితే మీరు మమ్మల్ని అర్థం చేసుకున్నారా? మా స్నేహాన్ని ఆమోదిస్తున్నారా? నాకు చాలా సంతోషంగా వుంది'' రాజీవ్ పసిపిల్లాడిలా గంతులేసాడు.


''నిజం మావయ్యాగారూ! మన ఆచారాలకూ, వాళ్ళ పద్ధతులకూ పొంతన లేదని, మన సనాతన ధర్మాలను కూలదోస్తున్నారని, మీరూ, అత్తయ్యా ఇంక మా ముఖాలు చూడరనుకున్నాం. అందుకని విషయం మీదాకా రానివ్వకూడదని జాగ్రత్త పడ్డాం.''

''మీరైతే ఇలా అనుకున్నారు కానీ పసి మనసుల్లో రహస్యాలకి, దాపరికాలకి చోటెక్కడిదీ! మా ఒడిలో పెరిగిన మా మనుమలు ఎప్పటికప్పుడూ అన్నీ రాస్తుండే వారు. రవి బైబిల్ గొప్పతనాన్ని గురించి ఎంత గొప్పగా రాసాడో! ఆ ఉత్తరాలన్నీ దాచిపెట్టాం. ఇక రాధిక సరేసరి. మేరీతో తనూ పాడిన జీసస్ మహిమని చాటిచెప్పే పాటలతో కాసెట్ కూడా పంపింది. అలా అల్లుకుపోతున్న 'మమతల పందిరి'ని నేల మట్టం చేసే సంస్కారహీనులమా? అందుకే మేమూ ఈ చిన్నారులతో చేయికలిపాం. మీకు ఇంకో విషయం తెలియదర్రా! మేము గోవానుంచి వీళ్ళందరి కోసం ఎన్నో బహుమతులు తీసుకొచ్చాం. రేపు మీ నాన్న క్రిస్మస్ తాతయ్య వేషం కట్టి మరీ వాటిని వీళ్ళందరికీ పంచిపెడతారు'' వైదేహి భర్త ముఖంలో కొంటెగా చూస్తూ అంది.

''అత్తయ్యా! నేను ఇన్నాళ్ళు మీలో పార్వతీ పరమేశ్వరులనే చూసాను. మానవత్వం, దైవత్వం మేళవించిన మహనీయులు మీరు'' గద్గదిక స్వరంతో అంది రాగిణి.

''అంతలేసి మాటలెందుకమ్మా. మనుష్యుల మధ్య అవగాహన ఉంటే చాలు. కులమతాలు, హెచ్చుతగ్గులు, తరాల అంతరాలు ఏవీ అడ్డుగోడలుగా నిలవవు. ప్రతీ కుటుంబం 'మమతల పందిరి' కిందే ప్రశాంతంగా జీవించగలుగుతుంది'' అంటూ కోడలిని దగ్గరకు తీసుకుంది వైదేహి. రాజీవ్, రాగిణి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. ★

## అక్షయ్‌కుమార్ బడాయి!



★ తను నటించిన కిలాడీ-420 సినిమా తప్పక హిట్ అయి తీరుతుందంటున్నాడు అక్షయ్. కారణాలు ఇవట..



★ మహిమా చౌదరి, ఆంత్ర సూపర్‌గా వున్నారట.

★ స్టంట్ సీన్స్ శభాష్ అనిపించుకునేలా చేశాడట.

★ మూడువేల అడుగుల ఎత్తునుండి ఫ్లయిట్‌లో నుండి దూకే సీన్ నేచురల్‌గా వచ్చిందిట.

★ హీరోగా తనకి తప్పక అవార్డ్ వస్తుందిట.

అక్షయ్! ఇన్ని ఆశలు పెట్టుకున్న నీకు ప్రేక్షకులు ఏవిధమైన తీర్పునిస్తారో వేచి చూద్దాం.

## ఘోస్ట్ సంగీత దర్శకులు

ఘోస్ట్ రైటర్స్ వున్నట్టే ఘోస్ట్ సంగీత దర్శకులు కూడా ఉన్నారని మీకు తెలుసా? తెలుగు, తమిళ్‌లో ఇలాంటి సంగీత దర్శకులు వున్నారు. పాటకి ట్యూన్‌ని కంపోజ్ చేసి ఇస్తే, సంగీత దర్శకుడిగా మాత్రం తన పేరుని టైటిల్స్‌లో వేసుకునేవాళ్ళెందరో ఈ ఫీల్డ్‌లో వున్నారు. కావలసినంత డబ్బు ఇచ్చేసి, తమ పేరుతో బయటకు వచ్చేలా చూసుకుంటారు. అలానే ఘోస్ట్ లిరిక్ రైటర్స్, ఘోస్ట్ డైరెక్టర్స్ కూడా తయారవుతున్నారు. పబ్లిక్‌కి తెలియదు కదానే వీళ్ళ ధీమా! చూద్దాం! ఎన్నాళ్ళు సాగుతుందీ బండారం?

- విరాజి

